క్లుప్తంగా

ఇంటి వద్దకే వైద్య సేవలు



గడివేములలో మంచానికే పరిమితమైన బాలున్ని పరిశీలిస్తున్న వైద్యాధికారిణి జబీనా

గడివేముల: రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ద్వారా ఇంటి వద్దకే వైద్యసేవలు అందిస్తున్నట్లు వైద్యాధికారిణి జబీనా తెలిపారు. మంగళవారం మండల కేంద్రమైన గడివేముల గ్రామంలోని ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ప్రజలు ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలోని 25 మందికి, అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రంలోని విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. గ్రామంలో మంచానికే పరిమితమైన రోగుల ఇంటి వద్దకి వెళ్లి పరీక్షలు నిర్వహించడంతోపాటు పలు సూచనలు చేసి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

7న ఎల్లమ్మ హుండీ ఆదాయం లెక్కింపు

కర్నూలు (న్యూటౌన్): ఈ నెల 7వ తేదీన శనివారం ఉదయం 10 గంటలకు కర్నూలు మండలం వెంకాయపల్లె ఎల్లమ్మ తల్లి దేవస్థానం హుండీ ఆదాయం లెక్కింపు నిర్వహించనున్నట్లు దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎస్ సీతారామిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హుండీ ఆదాయం లెక్కింపులో దేవదాయ,ధర్మాదాయశాఖ అధికారులు, దేవస్థానం చైర్మన్ బీతం కృష్ణుడు, ఎల్లమ్మ దేవస్థానం కమిటీ సభ్యులందరూ పాల్గొనాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యంలోని పాత ఆసుపత్రి వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పాణ్యంకు చెందిన వై.సునీల్ ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ముందు వెళ్తున్న వాహనాన్ని దాటే క్రమంలో ఢీకొట్టాడు. దీంతో తీవ్రంగా గాయపడిన సునీల్‌ను స్థానికులు నంద్యాల సమీపంలోని శాంతిరాం ఆసుపత్రికి తరలించారు.

సమస్యలు పరిష్కరించాలి

సి.బెళగల్: వ్యవసాయ కూలీల సమస్యలను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకుడు మోహన్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రం సి.బెళగల్‌లో ఆ సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించి వ్యవసాయ రంగ సమస్యలు, కార్మిక చట్టాలు, అమలుపై మాట్లాడారు. కోడుమూరు పట్టణంలో ఈ నెల 7వ తేదీన నిర్వహించనున్న జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో చిన్న అక్బర్, హనుమంతు, జైలు, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి



కంబదహాల్ సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న ఈఓఆర్డీ సందీప్

సి.బెళగల్: గ్రామ సచివాలయ ఉద్యోగులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని ఈఓఆర్డీ సందీప్ అన్నారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని కంబదహాల్ గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. సచివాలయంలోని రికార్డులు, ఉద్యోగుల హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం ఉద్యోగులు, వలంటీర్లతో మాట్లాడారు. ఉద్యోగుల హాజరు, పనితీరుపై గ్రామ ప్రజలు తరచుగా ఫిర్యాదులు చేస్తున్నారని, పద్ధతి మార్చుకోవాలని, లేకపోతే చర్యలుంటాయని హెచ్చరించారు. అనంతరం ఆయన గ్రామంలోని చెత్త సంపద తయారీ కేంద్రం పరిశీలించి అక్కడ ఉన్న సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి అభిషేక్ ఉన్నారు.

కోలుకోలేక కబడ్డీ క్రీడాకారుడు మృతి



పాల సమర(ఫైల్)

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యంకు చెందిన పాల బాలస్వామి, సామక్కల కుమారుడు పాల సమర(23) కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. పాల సమర బేతంచెర్ల నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా సుగాలిమెట్ట వద్ద టిప్పర్ వాహనానికి ఢీకొన్నాడు. దీంతో తీవ్ర గాయాలైన అతన్ని చికిత్స నిమిత్తం నంద్యాల ఆస్పత్రికి అక్కడి నుంచి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్‌ఐ చెప్పారు. తండ్రి బాలస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. పాల సమర కబడ్డీ క్రీడాకారుడు. గతంలో రాష్ట్ర, జిల్లాస్థాయిలో పాణ్యం తరుపున కబడ్డీ పోటీలు ఆడి ప్రతిభ చాటుకున్నాడు. అతని మరణవార్త తెలుసుకున్న తోటి కబడ్డీ క్రీడాకారులు, కబడ్డీలో శిక్షణ ఇచ్చిన గురువులు భారీ ఎత్తున భౌతిక కాయం వద్ద నివాళులర్పించారు.

అర్హులైన పేదలందరికీ పింఛన్లు

- ఎల్లో మీడియా, టీడీపీ తప్పుడు ప్రచారాలు నమ్మొద్దు
- పెన్షన్ వారోత్సవాల్లో ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్



గౌండ అబ్దుల్ జలీల్‌కు పింఛన్ సొమ్మును అందిస్తున్న ఉప సర్పంచ్ శివానందరెడ్డి



సమావేశానికి హాజరైన లబ్ధిదారులు



కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

గూడూరు రూరల్: అర్హులైన పేదలందరికీ పింఛన్లు అందిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ స్పష్టం చేశారు. గూడూరు పట్టణంలోని వైకేపీ కార్యాలయం ఆవరణలో మంగళవారం వైఎస్సార్ పెన్షన్ కానుక వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పాదయాత్రలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చాక పింఛన్లను విడతల వారీగా పెంచుతున్నారన్నారు. ఇందులో భాగంగానే మూడో సారి రూ.2500 నుంచి రూ.2750కు పెంచి పింఛన్‌దారుల కుటుంబాల్లో ఆనందం నింపారన్నారు. గడచిన మూడున్నరేళ్ల కాలంలో 30 లక్షల మందికి పైగా కొత్తగా పింఛన్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఎల్లోమీడియా, టీడీపీ పింఛన్లు తొలగించారని తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, ప్రజలందరూ గమనించాలన్నారు. ఆరు నెలలకు ఒక సారి పింఛన్లపై సోషల్ ఆడిట్‌ను ప్రభుత్వం జరుపుతుందని, అందులో భాగంగా కొంత మందికి అధికారులు నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు. నోటీసులు తీసుకున్న వారిని అధికారులు విచారించి అర్హులైన వారికి పింఛన్లను పునరుద్ధరించారని తెలిపారు. అర్హత ఉన్న పేదలకు తప్పనిసరిగా ప్రభుత్వం పింఛన్లను మంజూరు చేస్తుందని, ప్రజలు భయపడాల్సిన అవసరం లేదన్నారు. సీఎం జగనన్న నవరత్నాల పథకాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చారని, కరోనా వంటి కష్ట సమయంలో కూడా సంక్షేమ పథకాలను నిరాటంకంగా కొనసాగించి అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. అనంతరం కొత్తగా మంజూరైన 84 మంది లబ్ధిదారులకు రూ.2750 చొప్పున పింఛన్ సొమ్మును పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మౌలాలి, ఎంపీపీ సునీత, వైస్ ఎంపీపీ రాజమ్మ, కోఆప్షన్ సభ్యుడు దౌల, నగర పంచాయతీ చైర్మన్ జె.వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్లు పీఎస్ అస్లాం, లక్ష్మన్న, మాజీ జెడ్పీటీసీ ఎల్.వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యుడు రంగయ్య, కౌన్సిలర్లు ఖలీల్‌బాషు, కలాం బాష, దస్తగిరి, బజారి, కమిషనర్ శ్రీనివాసులు, ఎంపీడీఓ మాధవీలత, ఏపీఎం సుధాకర్, కుమార్, డ్రైవర్ మద్దిలేటి, నందకిషోర్, విజయుడు తదితరులు పాల్గొన్నారు.

గనిలో పింఛన్ల పంపిణీ

గడివేముల: అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని గని గ్రామ ఉప సర్పంచ్ శివానంద రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గని గ్రామంలో పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. కొత్త పింఛన్లు మంజూరు చేయడంతో పాటు ఈ నెల నుంచి రూ.2750కు పింఛన్ సొమ్ము పెంచడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అనంతరం నూతనంగా మంజూరైన 13 పింఛన్లను లబ్ధి దారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీధర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ మల్లికార్జున రెడ్డి

గడివేముల: ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి ప్రజలకు అందుబాటులో ఉండాలని నంద్యాల జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ మల్లికార్జున రెడ్డి సూచించారు. మంగళవారం మండల కేంద్రమైన గడివేములలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. ప్రభుత్వం లెప్రసీ, ఎయిడ్స్‌పై సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లో వివిధ సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ తేజస్వీని, ఫార్మసిస్ట్ రాజ్‌కుమార్, ఏఎన్ఎం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కోడుమూరులో మరోసారి పార్టీ జెండా ఎగురవేద్దాం





కార్యక్రమంలో సంఘీభావం వ్యక్తం చేస్తున్న రీజనల్ కోఆర్డినేటర్లు, నగర మేయర్, ఎమ్మెల్యే కుడా చైర్మన్ , హాజరైన నాయకులు, కార్యకర్తలు

- వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్లు

కర్నూలు (న్యూటౌన్): రానున్న ఎన్నికల్లో కోడుమూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా మరోసారి ఎగురవేద్దామని వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్లు అమర్‌నాథ్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం స్థానిక ఏటూజెడ్ ఫంక్షన్ హాలులో కోడుమూరు నియోజకవర్గ పార్టీ ముఖ్య నేతల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, నగర మేయర్, కర్నూలు జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా రీజనల్ కోఆర్డినేటర్లు మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి అమలు చేస్తున్న నవరత్నాల పథకాల వల్ల అన్ని వర్గాల ప్రజలు సంతృప్తికరంగా ఉన్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వెళ్తున్న నాయకులు, ప్రజాప్రతినిధులకు ప్రజలు బ్రహ్మరథం పట్టడమే ఇందుకు నిదర్శనమన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆయా సచివాలయాల పరిధిలో నెలకొన్న చిన్న చిన్న సమస్యలను పరిష్కరించేందుకు ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షలు ముఖ్యమంత్రి కేటాయించారన్నారు. ఈ నిధులతో అన్ని సచివాలయాల పరిధిలో అభివృద్ధి పనులు ఊపందుకున్నాయని చెప్పారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులకు తోడుగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో పని చేస్తే వైఎస్సార్ సీపీని ఎదుర్కోవడం ఏ పార్టీ తరం కాదన్నారు. కార్యక్రమంలో ఆయా మండలాల వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



థెరిసమ్మ సంస్మరణ సభలో ప్రార్థనలు చేస్తున్న మంత్రి, ఎమ్మెల్యేలు, కలెక్టర్ తదితరులు

థెరిసమ్మ సేవలు మరువలేనివి

కర్నూలు సిటీ: రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డా.ఆదిమూలపు సురేష్ మాతృమూర్తి జార్జ్ విద్యా సంస్థల చైర్మన్ చెరుకూరి థెరిసమ్మ గత నెల 26న మరణించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం స్థానిక ఏక్యాంపులోని మదర్ థెరిస్సా ఫార్మసీ కాలేజీ ఆవరణలో థెరిసమ్మ సంస్మరణ సభను ఏర్పాటు చేశారు. జార్జ్ విద్యా సంస్థల కార్యదర్శి, ఫార్మసీ కాలేజీ డైరెక్టర్ డా.ఆదిమూలపు సతీష్ అధ్యక్షతన నిర్వహించిన సభలో మంత్రితో పాటు, జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు, ఎమ్మెల్యేలు ఎం.ఏ హఫీజ్‌ఖాన్, ఆర్థర్, చెన్నకేశవరెడ్డి, ఆర్‌యూ వీసీ ఆచార్య ఆకెపోగు ఆనందరావు, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డిలు పాల్గొని థెరిసమ్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు ప్రసంగించారు. ఓ సాధారణ టీచర్‌గా వృత్తిని ప్రారంభించిన థెరిసమ్మ తన పిల్లలతో పాటు, అందరు చదువుకోవాలనే ఉన్నత లక్ష్యంతో వెనుకబడిన ప్రాంతాల్లో విద్యా సంస్థలు ఏర్పాటు చేశారన్నారు. విద్యాభివృద్ధికి ఆమె చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో మదర్ థెరిస్సా ఫార్మసీ కాలేజీ అకడమిక్ డైరెక్టర్ డా.స్టెల్లా సతీష్, రవీంద్ర విద్యా సంస్థల వ్యవస్థాపక అధ్యక్షుడు జి.పుల్లయ్య, డా.కె.వి సుబ్బారెడ్డి విద్యా సంస్థల అధినేత డా.కె.వి సుబ్బారెడ్డి, జార్జ్ విద్యా సంస్థల పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలకు పరిష్కారం చూపాలి



ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సుధాకర్



హైస్కూల్ నూతన భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

- అధికారులకు ఎమ్మెల్యే సుధాకర్ ఆదేశం
- మునగాలలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

గూడూరు రూరల్: ప్రజా సమస్యల పరిష్కారంపై సచివాలయ ఉద్యోగులు, అధికారులు శ్రద్ధ చూపాలని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని మునగాలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ముందుగా స్థానిక నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి భారీ గజమాలతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే ఎస్సీ కాలనీలో ప్రభుత్వ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. తర్వాత కాలనీలో ఇంటింటికీ వెళ్లి మూడున్నరేళ్ల ప్రభుత్వ పాలనలో ఆయా కుటుంబాలకు అందిన సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే వారి సమస్యలు అడిగి తెలుసుకొని వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, ఆయా శాఖల అధికారులు సమన్వయం చేసుకుని ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, వినతులకు వెంటనే పరిష్కారం చూపాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు విన్నవించుకున్న ప్రతి సమస్యకూ పరిష్కారం చూపాలని ఆదేశించారు. స్థానిక సచివాలయానికి మంజూరైన రూ.20 లక్షల నిధులతో కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేస్తామన్నారు. అదేవిధంగా అర్హులకు, లబ్ధిదారులకు రేషన్‌కార్డులు, జాబ్‌కార్డులు, గృహ నిర్మాణ బిల్లులు మంజూరు చేయాలని అధికారులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో సర్పంచు గోపాల్, గూడూర నగర పంచాయతీ చైర్మన్ జె.వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్లు అస్లాం, లక్ష్మన్న, వైస్ ఎంపీపీ సువార్తమ్మ, రామాంజనేయులు, డీలర్ మద్దిలేటి, ఎంపీడీఓ మాధవీలత, ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ సన, పీఆర్ ఏఈ గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.


విద్యతోనే విద్యార్థులకు మంచి భవిష్యత్

పేద విద్యార్థులకు విద్యతోనే మంచి భవిష్యత్ లభిస్తుందని, అందుకు ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని ఎమ్మెల్యే సుధాకర్ పేర్కొన్నారు. మంగళవారం మునగాల గ్రామంలో కొత్తగా నిర్మించనున్న హైస్కూల్ భవనానికి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై దృష్టి సారించారన్నారు. నాడు–నేడు కార్యక్రమం ద్వారా వాటి రూపురేఖలు మారుస్తున్నారన్నారు. అదేవిధంగా జగనన్న గోరుముద్ద, అమ్మఒడి, విద్యా కానుక పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. గ్రామంలోని హైస్కూల్ భవనం పూర్తిగా శిథిలం కావడంతో కొత్త భవనాన్ని నిర్మించేందుకు ప్రభుత్వం రూ.96 లక్షల నిధులు మంజూరు చేసిందన్నారు. కొత్త భవనం ఏర్పాటైతే మల్లాపురం, మునగాలకు చెందిన విద్యార్థులు చదువుల కొరకు ఇతర గ్రామాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు. కార్యక్రమంలో సర్పంచు గోపాల్, జెడ్పీటీసీ సభ్యుడు మౌలాలి, వైస్ ఎంపీపీ సువార్తమ్మ, రామాంజనేయులు, డీలర్ మద్దిలేటి, గూడూరు నగర పంచాయతీ చైర్మన్ జె.వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్లు అస్లాం, లక్ష్మన్న, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రి బాయి ఫూలే జయంతి



పాణ్యం ఏపీ మోడల్‌స్కూల్‌లో ఫూలే దంపతుల విగ్రహాలను ఆవిష్కరించిన ప్రజాసంఘాల నాయకులు



పర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం



సి.బెళగల్ జెడ్పీ హైస్కూల్లో...



ఓర్వకల్లు పాఠశాలలో ఫూలే దంపతుల విగ్రహాలకు నివాళులర్పించిన దృశ్యం

కల్లూరు/ఓర్వకల్లు:భారతదేశ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త సావిత్రి బాయి ఫూలేని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు.మహిళా సాధికారత కోసం ఆమె చేసిన సేవలు వెలకట్టలేనివన్నారు. మంగళవారం సావిత్రి బాయి ఫూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఇందులో భాగంగా కల్లూరు మండలం పర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు ఆమె చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు వ్యాస రచనపోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశా రు. పాఠశాలకు చెందిన మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. లక్ష్మీపురం కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం (మైనార్టీ)లో సావిత్రి బాయి జయంతి వేడుకలు నిర్వహించారు. ఓర్వకల్లు జెడ్పీ హైస్కూల్ ఆవరణలో జరిగిన వేడుకల్లో ఆర్‌వీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్ మాట్లాడుతూ..భారత తొలి మహిళా ఉపాధ్యాయురాలైన సావిత్రి బాయి ఫూలే, జ్యోతిరావు ఫూలే జయంతులను అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, పీ ఎంసీ అధ్యక్షులు మద్దిలేటి, వైఎస్సార్‌సీపీ నాయకులు శంకర్‌రెడ్డి, ఎస్‌ఐ మల్లికార్జున, రాయలసీమ యూత్ యూనియన్ జిల్లా అధ్యక్షులు విక్రమ్ నాయక్ పాల్గొన్నారు.

పాణ్యం/సి.బెళగల్: పాణ్యం మండల పరిధిలోని సుగాలిమెట్ట వద్ద ఉన్న ఏపీ మోడల్ స్కూల్ మహాత్మా జ్యోతిరావు ఫూలే, సావిత్రిబాయి ఫూలే నూతన విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కమిట్టల శ్రీనివాసులు, మహిళా ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి, ఆర్‌వీఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయుడు, తహసీల్దార్ మల్లికార్జునరెడ్డి, ఎంఈఓ కోటయ్యలు మాట్లాడారు. దేశంలోని అణగారిన వర్గాల అభివృద్ధి కోసం సావిత్రి బాయి ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. అనంతరం మహిళా టీచర్లను సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవిబాయి, రవీంద్రనాథ్, ప్రతాప్, రియాజ్, వెంకటాద్రి, శ్రీనివాసరావు, నంది విజయలక్ష్మీ, అన్వర్, వైస్ ప్రిన్సిపాల్ వీరేష్ తదితరులు పాల్గొన్నారు. సి.బెళగల్ జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు ఫూలే దంపతుల విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా స్థానిక బీసీ హాస్టల్‌లో వార్డెన్ రాముడు, బురాన్‌దొడ్డి ప్రాథమిక పాఠశాలలో సావిత్రిబాయి జయంతి వేడుకలు నిర్వహించారు.

మైనింగ్ తవ్వకాలపై అభ్యంతరాల వెల్లువ



అభ్యంతరం వ్యక్తం చేస్తున్న మాజీ సర్పంచు రామకృష్ణ

ఓర్వకల్లు: మండలంలోని కేతవరం గ్రామ రెవెన్యూ పరిధిలో చేపట్టనున్న సిలికాశాండ్ మైనింగ్ తవ్వకాలపై స్థానికుల నుంచి అభ్యంతరాలు వెల్లువెత్తాయి. టీడీపీ నేత కేఈ కుటుంబ సభ్యులు సర్వే నెంబర్ 288/పిలో దాదాపు 105 ఎకరాలలో సిలికాశాండ్ మైనింగ్ తవ్వకాలకు దరఖాస్తు చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన అనుమతుల కోసం మంగళవారం కాలుష్య నియంత్రణ మండలి ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. కర్నూలు డీఆర్‌ఓ నాగేశ్వరరావు, తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామస్తులు మాజీ సర్పంచు రామకృష్ణ, శ్రీధర్, నాగన్న వ్యతిరేకించారు. కేతవరం ప్రాంతంతో మైనింగ్ తవ్వకాలు జరపడంతో కన్నమడకల, కలమందలపాడు,కేతవరంగ్రామాలకు చెందిన చిన్న,సన్నకారు రైతులకు ఇబ్బంది కలుగుతుందన్నారు. మైనింగ్ కాలుష్యం వల్ల ప్రజలు అనారోగ్యాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. కావున తక్షణమే పరిశ్రమకు అనుమతులను నిలిపివేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు వెంకటేశ్వర్లు, రంగస్వామి, బుగ్గరాముడు, నాగరాజు, మధుసూదన్, కన్నమడకల, కలమందలపాడు రైతులు పాల్గొన్నారు.

ఆర్‌యూ సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(సెంట్రల్): రాయలసీమ యూనివర్సిటీ(ఆర్‌యూ)లో నెలకొన్న అంతర్గత సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఈ. శ్రీరాములుగౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వర్సిటీపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో విద్యార్థుల సమస్యలు పరిష్కారం కాక ఆత్మహత్యలు చేసుకోవడం వరకూ వెళ్తున్నారన్నారు. వీసీగా ఆనందరావు పదవి బాధ్యతలు చేపట్టిన తరువాత సమస్యలు పెరుగూ పోతున్నాయే తప్పా తగ్గడంలేదన్నారు. ఎవరైనా సమస్యలు చెప్పితే వారిని నిర్లక్ష్యంగా వర్సిటీ నుంచి బయటకు పంపుతున్నారని ఆరోపించారు. హాస్టళ్లలో భోజనం బాగుండడంలేదని, ఎవరైనా ప్రశ్నిస్తే ఇంటికి పంపుతారనన్న భయంతో విద్యార్థులు వారు పెట్టిందే తిని అనారోగ్యంపాలవుతున్నారన్నారు.

సేవాభావం కలిగి ఉండాలి



గడిగరేవులలో ఉచిత అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న సీఐ, సర్పంచ్

గడివేముల: సమాజంలోని ప్రతి ఒక్కరూ సేవా భావం కలిగి ఉండాలని పాణ్యం సీఐ వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం మండలంలోని చిందుకూరు గ్రామానికి చెందిన దుర్గాభోగేశ్వరాలయం ప్రధానార్చకుడు శ్యాంసుందర్‌శర్మ, అతని తండ్రి విశ్వనాథ శర్మ జ్ఞాపకార్థం రూ.8 లక్షలతో ఉచితంగా అంబులెన్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ చిందుకూరు, గడిగరేవుల గ్రామాల ప్రజలకు అన్ని రకాల సదుపాయాలతో అంబులెన్స్ ఏర్పాటు చేయడం మంచి పరిణామం అన్నారు. తన సొంత ఊరితో పాటు ప్రక్కన ఉన్న గ్రామానికి అంబులెన్స్ సౌకర్యం కల్పించిన శ్యాంసుందర్‌శర్మను డాక్టర్లు జబీనా, తేజస్వినిలు అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ బీటీ వెంకటసుబ్బయ్య, సర్పంచ్ రామ్మోహన్‌రెడ్డి, ఉప సర్పంచ్ గోదా ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు హరినాథ్ రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, జక్కుల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేతో రైతులకు ప్రయోజనం

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలంలోని అన్ని గ్రామాల్లో జరుగుతున్న భూముల రీ సర్వేతో భూ వివాదాలు పరిష్కారమవుతాయని, దీంతో రై తులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని క ర్నూలు రూరల్ తహసీల్దార్ డి వెంకటేష్ నాయక్ అన్నారు. ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో ని 21 రెవెన్యూ గ్రామాల్లో మంగళవారం నాటికి 24040.24 ఎకరాల్లో భూముల రీ సర్వే పూర్తయిందని వెల్లడించారు. గ్రామాల్లోని పొలాల్లో రెవెనూ ఉద్యోగులు చేపట్టే రీసర్వేకు రైతులు, ప్రజలు సహకరించాలని కోరారు.

నేటి సమాచారం

32వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

కల్లూరు: కల్లూరు అర్బన్ 32వ వార్డు 81వ వార్డు సచివాలయం పరిధిలోని గంగావతి నగర్, ముజఫర్‌నగర్ కాలనీలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉంటుందని ఎమ్మెల్యే కార్యాలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి హాజరుకానున్నారు. కావున కల్లూరు అర్బన్ పరిధిలోని కార్పొరేటర్లు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

గఫూర్ పార్కులో పెన్షన్ వారోత్సవాలు: అమ్మ ఆస్పత్రి సమీపంలోని గఫూర్ పార్కులో బుధవారం పెన్షన్ వారోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా కల్లూరు అర్బన్ పరిధిలోని 19, 20, 21 వార్డుల్లో కొత్తగా పెన్షన్లు మంజూరైన వారికి పంపిణీ కార్యక్రమం ఉంటుంది. ఈ కార్యక్రమానికి పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు.